క్లుప్తంగా

లబ్ధిదారుల వివరాల నమోదు



శాయంపేట : ఇటీవల చేపట్టిన ప్రజాపాలన, గ్రామసభల్లో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల జాబితాను డేటా ఎంట్రీ చేస్తున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. రేషన్ డీలర్లు తమ షాపు పరిధికి వచ్చే లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించి షాపు నంబర్లు నమోదు చేసినట్లు చెప్పారు. డేటా ఎంట్రీ పూర్తిచేసిన అనంతరం సివిల్ సప్లయ్ కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసిల్దార్ ప్రభావతి, ఆర్‌ఐలు రమేశ్‌ఖన్నా, రమేశ్, రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు, కార్యాలయ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

అగ్రంపహాడ్‌లో భక్తుల మొక్కులు



ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్‌లో సమ్మక్క–సారలమ్మ మినీ జాతరను పురస్కరించుకుని భక్తులు ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. నగరంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి సమ్మక్క–సారలమ్మను దర్శించుకుని బంగారం, మొక్కులు సమర్పించారు. తల్లీ సల్లంగా చూడు అంటూ వేడుకున్నారు.

కాకొండలో ఉచిత వైద్య శిబిరం



నడికూడ : మండలంలోని కౌకొండ గ్రామానికి చెందిన డాక్టర్ మేకల చంద్రమోహన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య సిబ్బంది ఆదివారం కౌకొండలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, క్యాన్సర్, ఈసీజీ, ఎకో పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వేరో సభ్యుడు డాక్టర్ చంద్రమోహన్‌ను శాలువాతో సన్మానించారు. స్వేరో రాష్ట్ర కోకన్వీనర్ పుల్ల కిషన్, శనిగరపు రాజేంద్రప్రసాద్, మేకల రాజవీరు, రవి, మహేష్, సాంబయ్య పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామకమిటీ ఎన్నిక



పరకాల : మండలంలోని లక్ష్మీపురం ఎమ్మార్పీఎస్ గ్రామకమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ ఆదివారం తెలిపారు. గ్రామకమిటీ అధ్యక్షుడిగా మంగళపల్లి రమేశ్‌మాదిగ, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, కోశాధికారిగా రాజు, గౌరవ సలహాదారుడిగా మల్లయ్య, గ్రామ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

పరామర్శ



ఆత్మకూరు : మండలంలోని చౌళ్లపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కొక్కరకొండ అయిలయ్య, కుక్కముడి పోశయ్య, అగ్రంపహాడ్ గ్రామానికి చెందిన గోనెల నర్సింహారాములు కుటుంబాలను ఆదివారం బీజేపీ నాయకుడు డాక్టర్ కాళీప్రసాదరావు పరామర్శించి ఆర్థికసాయం అందించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు రాజు, రాజు, శివప్రసాద్ పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జి పరామర్శ

వరంగల్: వరంగల్ కాశిబుగ్గ 19వ డివిజన్ సొసైటీకాలనీలోని తన మేనమామ చామర్తి శివరాంను తెలంగాణ హైకోర్టు జడ్జి నామవరపు రాజేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా శివరాం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జడ్జి వెంట వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఇంతేజార్‌గంజ్ సీఐ సుకూర్, ఎస్సై సందీప్, జిల్లా కోర్టు సిబ్బంది ఉన్నారు.

అరూరి రమేష్‌కు పరామర్శ

హన్మకొండ: బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, సంఘం నాయకులు పరామర్శించారు. జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్ గ్రామంలోని స్వగృహంలో రమేష్‌ను ఆదివారం పరామర్శించారు.

ఆశాజనకంగా యాసంగి సాగు



పచ్చదనంతో నిండిన వరిపైరు



చేనులో కలుపు తీస్తున్న కూలీలు

- పచ్చదనంతో కళకళలాడుతున్న పొలాలు
- జోరుగా కలుపుతీత
- మండలంలో 15,100 ఎకరాల్లో సాగు

ఎల్కతుర్తి : మండలంలో యాసంగి సాగు ఆశాజనంగా మారింది. ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన మేర దిగుబడి రావడంతో సదరు రైతులు యాసంగి సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీనికి తోడు ప్రభుత్వం సన్నాలకు బోనస్ కల్పిస్తామని చెప్పడంతో మండల వ్యాప్తంగా యాసంగి సాగు జోరందుకుంది. మండల పరిధిలో మొత్తం 20 గ్రామ పంచాయతీలకు మరో రెండు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. వీటికి గాను మొత్తం 24,000 ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో ఈ ఏడాది యాసంగిలో 15,100 ఎకరాలు వరిసాగు నమోదు కాగా, 2000 ఎకరాల్లో మొక్కజొన్న, మిగతా ఎకరాల్లో మిర్చి, పసుపు, కూరగాయలు తదితర పంటలు సాగుచేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే ముందుగా వేసిన చేళ్లలో రైతులు కూలీల సహాయంతో కలుపులు తీయిస్తున్నారు. మరికొందరు వరిపైరుకు కాంప్లెక్స్ ఎరువులు చల్లుతున్నారు. మరికొందరు చీడపీడలు ఆశించకుండా ఉండేందుకు వాటి సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. ఇందులో దండేపల్లి, వీర్‌నారాయణపూర్, సూరారం, ఎల్కతుర్తి, బావుపేట, తిమ్మాపూర్, కేశవాపూర్, రామకృష్ణాపూర్ గ్రామాలు పూర్తిగా ఎస్సారెస్పీ ప్రధాన కాల్వకు దిగువన ఉన్నాయి. మిగతా గ్రామాలు పూర్తిగా మెట్ట ప్రాంతంలో ఉంటాయి. ఈ ప్రాంత రైతులు వ్యవసాయ బావులతో పాటు బోరుబావులు, చెరువుల నీరు, దేవాదుల కాల్వ నీటిపై ఆధారపడి ఉంటారు. మొత్తంగా రైతులు యాసంగిలో 100 శాతం వరిపంట సాగుచేశారు. అక్కడక్కడ వరికి జింక్ లోపం, సల్ఫేట్ ఇంజూరీ ఉన్నట్లు అధికారులు గత నెలలో గుర్తించారు. దీనిని నివారించేందుకు రైతులకు సూచన, సలహాలు ఇచ్చారు. మరోవైపు ఎస్సారెస్పీ కాల్వ నీరు పుష్కలంగా ప్రవహిస్తుండడంతో సాగునీరుకు ఏలాంటి ఇబ్బందులు లేవని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది యాసంగిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు.

ఎమ్మెల్సీ, స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తాం



ఉప్పల్‌లో ధర్నా, రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

కమలాపూర్ : ఉప్పల్‌ను మండల కేంద్రంగా ప్రకటించని పక్షంలో రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని మండల సాధన సమితి సభ్యులు, గ్రామస్తులు హెచ్చరించారు. ఉప్పల్‌ను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన ఆదివారం ఐదో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లతో భారీ ర్యాలీ నిర్వహించి కన్నూరు క్రాస్ రోడ్డు హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఉప్పల్‌ను మండలం చేయాలని ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఉప్పల్ మండల సాధన కోసం ఇప్పటికే ఉద్యమ కార్యాచరణ రూపొందించుకున్నామని, ప్రభుత్వం స్పందించని యెడల ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై వీరభద్రరావు వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ధర్నా, రాస్తారోకోతో రహదారిపై వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు నవీన్‌కుమార్, సంపత్‌రావు, దేవేందర్‌రావు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ ఇచ్చినా తీరు మారదా..?



కూలీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీస్‌లు (ఫైల్)



గూడ్స్ ట్రాలీలో ప్రయాణిస్తున్న కూలీలు

శాయంపేట : వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. ఈ క్రమంలో మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాలకు చెందిన కూలీలు వివిధ ప్రాంతాలకు కూలీకి వెళ్తున్నారు. అయితే గ్రూడ్స్ ట్రాలీలో 50 మందికి పైచిలుకు ఎక్కి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఎక్కడ కూలీ దొరికితే అక్కడికి వెళ్తూ జీవనాన్ని నెట్టుకువచ్చే వీరు.. గ్రూడ్స్ వాహనాల్లో పరిమితికి మించి ప్రమాదకరంగా ప్రయాణం చేయడంపై పలువురు హెచ్చరిస్తున్నా తీరు మారడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వ్యవసాయ కూలీలు పరిమితికి మించి ప్రయాణం చేస్తే 2022 మార్చి నెలలో మాందారిపేట శివారు కస్తూర్బా గాంధీ పాఠశాల ఎదురుగా ఉన్న మలుపు వద్ద పత్తిపాక గ్రామానికి చెందిన కూలీల ట్రాలీకి టిప్పర్ ఢీ కొట్టడంతో ఆరుగురు కూలీల చేతులు తెగిపడి అందులో నలుగురు మృతిచెందిన సంఘటన ఇప్పటికీ కళ్ల ముందు కనిపిస్తుందని పలువురు హెచ్చరిస్తున్నా వాహనదారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహిస్తున్నారు. అలాగే 2023 సంవత్సరంలో అదే గ్రామానికి చెందిన కూలీల ట్రాలీ రేగొండ మండల కేంద్రంలో పల్టీ కొట్టడతో కొందరు కూలీలు గాయాలపాలయ్యారు. అయినా వాహన యాజమానులు, వ్యసాయ కూలీల్లో మార్పు రావడం లేదని మండలవాసులు మండిపడుతున్నారు. ఇటీవల స్థానికులు గూడ్స్ వాహనదారులకు, కూలీలకు పోలీస్‌లు కౌన్సెలింగ్ ఇచ్చినా మార్పు రాలేదని, ఇప్పటికైనా ప్రమాదకరంగా ప్రయాణించడం మానుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

- ఎస్సై ప్రవీణ్‌కుమార్



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

ఎల్కతుర్తి : ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని కోతులనడుమ వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఇసుక ట్రాక్టర్ ఓనర్, డ్రైవర్ అల్లం సాంబరాజుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా కొనసాగించినట్లు తెలిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల్లో 56శాతం సీట్లు ఇవ్వాలి

- బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయకుమార్



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకుడు

వరంగల్: అన్ని రాజకీయ పార్టీలు 56శాతం సీట్లను బీసీలకు స్థానిక సంస్థల్లో కేటాయించాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయకుమార్ డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు కటకం విజయకుమార్ అధ్యక్షతన మట్టెవాడలో ఆదివారం జరిగిన సమావేశంలో పి.విజయకుమార్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో గతంతో 52 – 56శాతం ఉన్నా ఇప్పుడు 46శాతం రావడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. పూర్తి వివరాలు సేకరించిన అనంతరమే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో కుమ్మర, వడ్డెర, రజక సంఘాల అధ్యక్షులు ఆకారపు మోహన్, పల్లపు సమ్మయ్య, ఆనందం, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

బీసీ సబ్‌ప్లాన్ అమలుపై సమావేశం

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బీసీ సబ్ ప్లాన్ అమలుపై చర్చించేందుకు యునైటెడ్ వరంగల్ బీసీ ఇంటలెక్చువల్స్ సంఘం ఆధ్వర్యంలో కోఆర్డినేటర్ కె.కృష్ణ అధ్యక్షతన కాశిబుగ్గలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోఆర్డినేటర్లు అసోసియేట్ ప్రొఫెసర్ కె.వీరస్వామి, మండల పరశురాములు, ధర్మపురి రాజగోవిందు మాట్లాడుతూ ప్రస్తుత బీసీ సర్వే నివేదిక సరిగ్గా లేదని, వెంటనే దాన్ని సవరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో పలు బీసీ సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేలో పారదర్శకత లేదు



మాట్లాడుతున్న మహ్మద్ అబ్దుల్ హన్నన్

హన్మకొండ చౌరస్తా: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించిందని జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ హన్నన్ అన్నారు. హనుమకొండ రాయపురలోని జమాతే ఇస్లామీ హింద్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి 2024కు జనాభా లెక్కలు తారుమారయ్యాయని, బీసీలు 56.33 శాతం, ఎస్సీలు 17.43, ఎస్టీలు 10.45, ఓసీలు 15.79 శాతంగా ఉన్నట్లు ప్రకటించడం ఆందోళన కలిగిస్తోందని వాపోయారు. 16 లక్షల మంది (3.1శాతం) గణనలో పాల్గొనలేదని తెలిపారు. సంస్థ రాష్ట్ర కార్యదర్శి ముజాహిద్ ఇర్ఫాన్ మాట్లాడుతూ ముస్లిం సమాజం ఎల్లప్పుడూ వెనుకబడిన, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడుతోందని చెప్పారు. కామారెడ్డి బీసీ ప్లాన్ ప్రకారం 42శాతం సీట్లు బీసీలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సర్వే రిపోర్టులో ఉన్న తప్పులను సరిదిద్ది, పూర్తిస్థాయి నివేదికను వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో మహ్మద్ వహాజుల్ హక్, సర్వత్‌అలీ ముబీన్, సైఫ్, తహసీన్, బాబర్, అబ్దుల్, అలీం, షకీల్‌సాబ్ పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్

ఖిలా వరంగల్: ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్, సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి కోరారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సంగి ఎలేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దళితులు బాగుపడాలంటే చదువే పరిష్కారమని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఎస్సీలను ఏబీసీలుగా విభజించి, దళితులకు సమాన రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సమావేశంలో తాళ్లపల్లి జాన్‌పాల్, జన్ను రాజు, శంకర్, రాజేష్, నవీన్, సునీత, కుమారస్వామి, కోటి తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ గవర్నర్‌గా భారతి

హన్మకొండ చౌరస్తా: వాకర్స్ ఇంటర్నేషనల్ హనుమకొండ జిల్లా గవర్నర్‌గా రిటైర్డ్ కార్మికశాఖ అధికారి కూరాకుల భారతి బాధ్యతల స్వీకారోత్సవ కార్యక్రమం హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. గత గవర్నర్ ప్రభావతి నుంచి బాధ్యతలు స్వీకరించిన భారతి.. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాకర్లకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన వాకర్లకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం, తన్వి నేచురోపతి క్లినిక్ ఆధ్వర్యంలో వాకర్లకు ఆక్యుపంచర్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా నంది శ్రీనివాస్

హసన్‌పర్తి: ఎర్రగట్టు గుట్ట మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా నంది శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆదివారం ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా తోట నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా తోట రాకేష్, ఉపాధ్యక్షులుగా బండారి యాదగిరి, సహాయ కార్యదర్శిగా గుండపు సుధాకర్, కోశాధికారిగా ఉప్పుల సంపత్, సహాయ కోశాధికారిగా గంట రాజయ్య, సభ్యులుగా కోడెల ప్రవీణ్, ఆకుతోట చిరంజీవి, సురేష్, తోట నాగరాజు ఎన్నికయ్యారు.

సత్యసాయి కాలనీ అధ్యక్షుడిగా టీఆర్‌కే రెడ్డి

హసన్‌పర్తి: 55వ డివిజన్ సత్యసాయి కాలనీ అధ్యక్షుడిగా తుమ్మ రామకృష్ణారెడ్డి (టీఆర్‌కే రెడ్డి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పి.శ్రీధర్, గౌరవ అధ్యక్షుడిగా రాఘవరాజు, ఉపాధ్యక్షులుగా సాంబయ్య, నవీన్, కోశాధికారిగా బి.మొగిలితో పాటు మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న 'మార్నేని'

హన్మకొండ: తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుని తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ ఆపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, మధుమతి దంపతులు ఆంధ్రప్రదేశ్‌లోని బెజవాడ కనదుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.

కార్యవర్గం ఎన్నిక

హసన్‌పర్తి: ఎర్రగట్టు గుట్ట మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా నంది శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆదివారం ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా తోట నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా తోట రాకేష్, ఉపాధ్యక్షులుగా బండారి యాదగిరి, సహాయ కార్యదర్శిగా గుండపు సుధాకర్, కోశాధికారిగా ఉప్పుల సంపత్, సహాయ కోశాధికారిగా గంట రాజయ్య, సభ్యులుగా కోడెల ప్రవీణ్, ఆకుతోట చిరంజీవి, సురేష్, తోట నాగరాజు ఎన్నికయ్యారు.

ఆర్థికసాయం అందజేత

పరకాల : అనారోగ్యంతో మృతిచెందిన పట్టణంలోని శనిగరపు ప్రమీల కుటుంబానికి చేగువేరా యూత్ అసోసియేషన్ నాయకులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనిల్, కల్యాణ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

- డాక్టర్ రాంబాబు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాంబాబు

శాయంపేట : ధ్యానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని డాక్టర్ రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీరామచంద్ర మిషన్ ద్వారా హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి 16 వరకు మూడు రోజుల పాటు నవోదయ ఉన్నత పాఠశాలలో ధ్యాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ధ్యాన శిబిరానికి అధిక సంఖ్యలో పాల్గొని పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని అన్నారు. ధ్యాన శిబిరాన్ని ఉచితంగా ఏర్పాటు చేస్తున్న నవోదయ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మామిడి పద్మీకి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శారద, ట్రైనర్ నీరజ, అభ్యాసకులు జనార్ధన్, శాగంటి స్వామితో పాటు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు నీటి కష్టం



విరిగిపోయి నిరుపయోగంగా ఉన్న చేతిపంపు

వేలేరు : మండలంలోని ప్రాథమిక పాఠశాలలో తాగునీటి చేతిపంపు విరిగిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మధ్యాహ్నం భోజన సమయంలో పక్కనే ఉన్న బోర్ సహాయంతో క్యాన్ల ద్వారా నీటిని తెప్పిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం చేశాక చేతులు, ప్లేట్లు శుభ్రపరుచుకునేందుకు సరిపడా నీళ్లు లేకపోవడంతో విద్యార్థులకు తిప్పల తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చేతిపంపును బాగుచేయించాలని కోరుతున్నారు.

ఆధునిక పద్ధతులపై రైతుల దృష్టి

- డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ



డ్రోన్ సహాయంతో మొక్కజొన్న పంటపై పురుగు మందు పిచికారీ

వేలేరు : రైతులు వ్యవసాయ సాగులో ఆధునిక పద్ధతులను పాటిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన ఓ రైతు పంట పొలాల్లో, మొక్కజొన్న చేనులో పురుగు మందును డ్రోన్ సహాకారంతో పిచికారీ చేయించారు. డ్రోన్ నిర్వాహకుడు ఎకరానికి రూ.500 చార్జ్ చేస్తున్నారు. ఒక్క ఎకరం మొక్కజొన్న పంటలో కేవలం ఐదు నిమిషాల్లో పురుగుల మందు పిచికారీ చేశారు.

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై వీరభద్రరావు

కమలాపూర్ : రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహనదారులు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్సై వీరభద్రరావు సూచించారు. మండలంలోని భీంపల్లి క్రాస్ రోడ్డు వద్ద ట్రాలీ డ్రైవర్లు, కూలీలకు రోడ్డు ప్రమాదాల నివారణపై ఆదివారం అవగాహన కల్పించారు. ట్రాలీ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దన్నారు. డ్రైవర్లు విధిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అన్ని రకాల వాహన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, కూలీలు, పోలీసు సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠాపన



హోమం చేస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఆదివారం రెండోరోజు నేత్రపర్వంగా కొనసాగాయి. వేద పండితుడు శ్రీనివాసచార్యులు, నిర్మాణ దాత గుండ్లపల్లి వెంకటేశ్వర్లు, సరస్వతి దంపతుల ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ నేతృత్వంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉదయం 8గంటలకు మండపారాధన, హోమం, సాయంత్రం 6గంటలకు ధాన్యది, శయ్యాదివాసం నిర్వహించి హారతి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పరిశోధన పత్రం సమర్పణ



మామునూరు: రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఎన్సీఆర్టీ భోపాల్ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న జాతీయ సదస్సుకు హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామానికి చెందిన ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు డాక్టర్ కోల రవికుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కృత్రిమ మేధను బోధనా పద్ధతిలో ఏ విధంగా అనుసంధానం చేయవచ్చో అనే అంశంపై పరిశోధన పత్రాన్ని ఎన్సీఆర్టీకి రవికుమార్ సమర్పించారు. అనంతరం రవికుమార్‌కు ఎన్సీఆర్టీ అధికారులు ప్రశంసపత్రం అందజేసి అభినందించారు.